# మబ్బు విడిచింది

విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఆ క్రిందటి రాత్రే వచ్చి పడుకుని కలకత్తా వెళ్లె రైలు రాగానే, ఖాళీగా ఉన్న కంపార్టుమెంటు ఎక్కి, ఒక మూలగా కూర్చుంది కల్పన. చేతిలో ఒక పొట్లము గుండెకు గట్టిగా అదుముకుంది. మాసి వెలిసిపోయిన చీరె కట్టుకున్నది. పైటకొంగుతో ఒళ్ళు కప్పుకున్నది. ఆ కాగితపు పొట్లంలో ఒక జత బట్టలు అద్దం దువ్వెన పౌడరు బొట్టు ఉన్నట్టున్నాయి. జారి పడిపోకుండా గట్టిగా పట్టుకుని కూర్చుంది మధ్య మధ్య చేత్తో తడిమి చూసుకుంటూ.

మూడు ప్లాట్‌ఫారమ్‌ల మీద రైళ్ళాగి ఉన్నాయి. అన్నీ బొగ్గు నీళ్ళు నింపుకుంటున్నాయి. ఏ రైలు ఎప్పుడు ఎక్కడికి వెళ్తుందో కల్పనకు తెలియదు. ఎవరినీ అడిగి తెలుసుకోవాలనిపించలేదు. ఏ ఊరయితేనేం? ఇక్కడి నుంచి వెళ్ళటం ముఖ్యం. బిత్తర చూపులలో ఇటూ అటూ చూస్తున్నది.

కిటికీలోనుంచి తలపెట్టి బైటికి చూస్తున్నది. జనం గుంపులుగా వచ్చి సామాన్లతో ఎక్కుతున్నారు. ప్రతి రైలు ముందర జనసందడి విపరీతంగా ఉంది. అమ్మకందార్లు పెద్ద పెద్ద అంగలేస్తూ కేకలు పెడుతున్నారు.

కల్పన బిత్తరచూపులతో ఇటూ అటూ చూస్తూ ఉండగానే ఆమె ఎక్కిన కంపార్టుమెంటులోకి సూట్‌కేసులు చేతబట్టుకుని ఒక్కొక్కరే ఎక్కి కూర్చుంటున్నారు. 'ఆ సీటు నీది కాదు నాది' అంటూ లేచి సీట్లు మార్చుకుంటూ సందడి చేస్తున్నారు. రైలు బయలుదేరబోతున్నట్టుగా ఒక కూత వేసింది.

అప్పుడు గబగబా సూట్‌కేస్‌తో వచ్చి, తన సీట్ కోసం చూస్తున్నాడొక యువకుడు. అన్నీ సీట్లు నిండిపోయాయి. తన టికెట్‌నెంబరు గల సీట్ ముందుకు వచ్చి చూశాడు. ఆ మూలనున్న సీట్ తనది. కాని ఒక అమ్మాయి కూర్చుని ఉంది.

ఒక నిమిషంసేపు నిలబడి, ఆమెను చూసి వెనక్కి తిరిగి కంపార్టు

మెంటంతా కలయజూశాడు. కంపార్టుమెంటంతా తనే రిజర్వుచేయించాడు. మరి-ఆ సీట్లో........

అతడు తనను లేవమంటాడేమోనని కల్పన అటే చూస్తున్నది, భయంతో.

అతడు మాట్లాడకుండా పై బర్తుమీద సూట్ కేసు తలకింద పెట్టుకుని కాలిమీదకాలు వేసుకుని పడుకుంటూ కిందికి చూశాడు. ఆ అమ్మాయి దిగాలు పడ్డ చూపులతో అతడినే చూస్తున్నది-చక్రాలవంటికళ్ళను తిప్పుతూ.

ఆ అమ్మాయిని తన సీట్లోనుంచి లేపుదామనుకున్నాడు మొదట ఆ యువకుడు, సెలవుల్లో తన స్నేహితులతో కలకత్తా నగరం చూడాలని కంపార్టు మెంటు మొత్తం రిజర్వు చేయించుకున్నారు. అందరూ కంపార్టుమెంటు ముందరికి చేరుకుని ఎక్కారు. అంతా నిండిపోయింది. తనసీటు తనకిమ్మని అడిగితే ఆమె తలుపు దగ్గర కూర్చోవలసిందే.

మరొకసారి ఆమె ముఖం చూశాడు. ఏడ్చినట్టు కళ్ళూ ముఖం బాగా ఉబ్బి ఎర్రగా ఉన్నాయి. తలవెంట్రుకలు రేగినట్టుగా ఉన్నాయి. మాసిపోయిన వాయిల్ చీరె జాకెట్టుతో, చెప్పులులేని కాళ్లతో, ఒదిగి కూర్చుంది. ఒక చిన్న కాగితపు పొట్లం తప్ప సామానేమిలేదు. ముఖం పీక్కుపోయింది. కళ్ళల్లో బిత్తరచూపులు.

ఈ అమ్మాయి విద్యార్థిని అయి ఉంటుందా? అనుకున్నాడు-కాని మళ్ళీ-తన అంచనా తప్పేమోననుకున్నాడు. ఈ రోజుల్లో విద్యార్థినులు రంగు కళ్ళద్దాలు, ఎత్తుమడల కాలి జోళ్ళూ, పేదపిల్లలయినా సిల్కు చీరెలతో కనబడుతూ ఉంటారు. కాని ఈ అమ్మాయి అలా కనబడటంలేదు. తలదువ్వుకోవటం కూడా ఆధునికంగా లేదు. ఆ ముఖం దీనంగా ఉన్నా కళ్ళు తిప్పుకోలేనంత అందంగా ఉంది-

మరి-ఎవరీ సామాన్యురాలు?

ఇంట్లోనుంచి పారిపోతోందా?

ఏమో? తన కాలేజీలో ఎంతమంది అట్లా చెయ్యలేదు?

ఆ అమ్మాయి మోకాళ్ళమీద తలపెట్టుకుని ఆలోచిస్తోంది. ఒక పక్క నుంచి కన్నీళ్ళు కారిపోతున్నాయి. తనకు టికెట్ లేదు. టికెట్ లేకపోతే దానికి తగిన డబుల్ చార్జి కట్టాలి. తన దగ్గర అదీలేదు. రాత్రి భోజనం లేకుండా బస్సు

ఎక్కింది. ముఖం పదిరోజులు భోజనం లేనట్టుగా ఉంది. కడుపులో ఆకలి సొద పెడుతున్నది.

ఆమె అనుకుంది-ఒక పావుగంటయినా ఆగేస్టేషన్‌లో దిగిపోదామని.

కాని-దిగితే అక్కడెవరున్నారు? కొత్తఊళ్లో - ఒక రైల్వేస్టేషనులో దిగిన ఆడపిల్లలను చూసినవారంతా ప్రశ్నించి ఎటో లాక్కుపోతే? ఆ నిప్పుల కుంపటిలో నుంచేకదా తను వచ్చింది?

అయితే ఇప్పుడేం చేయాలి?

కంపార్టుమెంటులోని విద్యార్థులందరూ ఆమెనుచూసి "ఇదేమిటి మన కంపార్టుమెంటులో ఎక్కింది? ఇది రిజర్వుడు కదా. పొరబాటున ఎక్కిందేమో? వచ్చే స్టేషన్‌లో దిగిపోతుందేమోలే" అనుకుని కొందరు పేకాట వేశారు. కొందరు నవలలు చేతబట్టారు. మరి కొందరు క్రాస్‌వర్డు పజిల్ సాల్వు చేస్తూకూర్చున్నారు.

పైన పడుకున్న యువకుడు ఆమెను గురించి ఆలోచించటం మానలేదు.

టికెట్ కలెక్టరు వచ్చి అడిగినప్పుడు ఏం చేస్తుంది? నిజంగా టికెట్ లేకపోతే?

ఒకసారి కిందికి చూశాడు.

ఆమె కళ్ళనిండా నీళ్ళు-దీనవదనం.

ఆమె దిక్కులేనిదేమో?

టికెట్ కలెక్టరు ఆమె వేషంచూసి నిర్దాక్షిణ్యంగా దింపేస్తాడు.

ఊహ మాత్రానికే అతడి మనసు గిలగిల కొట్టుకున్నది.

అయితే తనేం చెయ్యాలి?

ఏమయినా చెయ్యగలడా?

తన పర్సులో సరిగ్గా కలకత్తాలో హాస్టల్‌కి చేరేవరకూ ఉంది డబ్బు.

రాబోయే స్టేషనులో తప్పకుండా టికెట్‌కలెక్టరు వస్తాడు.

ఆమె దీనవదనం మళ్ళీ కళ్ళకు కట్టినట్లయింది.

తన అంతరాత్మ తనను ఊరుకోనీయటంలేదు. "మదరాసులో ఐ. ఐ. టి చదువు ముగించబోతున్న నీకు-అంతమాత్రం వివేకంలేదా? ఆలోచించు. ఒక దీనురాలిని కాపాడే ప్రయత్నంచెయ్యలేవా? ఏదో విధంగా ఆమెను కాపాడు. ఇదే గతి నీ చెల్లెలికి పట్టిందనుకో. ఊరుకుంటావా? మానవత్వం ఉంటే తగిన విధంగా సహాయంచెయ్యి" అంతరాత్మ అతడిని రాచిరంపాన పెడుతున్నది.

అమ్మాయి సీటుకు తలానించి కళ్ళుమూసుకుంది. కణతలగుండా కన్నీళ్లు జారుతున్నాయి.

అతడు షాక్ తిన్నట్లు దిగ్గునలేచాడు. పైనుంచిదిగి బాత్‌రూమ్ వరకువెళ్ళి, అక్కడఉన్న కిటికీలోనుంచి బైటికి తొంగిచూశాడు.

రైలు వేగంగా ముందుకునడుస్తుంటే పొలాలు చెట్లూ వెనక్కు పరుగులు తీస్తున్నదృశ్యం. అనాదిగా అందరూ చూస్తున్నదే-అయినా అతడికి దానిని చూడగానే ఆందోళన మరింత ఎక్కువయింది. కంపార్టుమెంటులోకి చూసి ఒకరిని పిలిచాడు.

"ఒరే ఆనందూ, నేను టికెట్లన్నీకొని రిజర్వుచేయించాను. ఇప్పుడు చూస్తే ఒకటి తక్కువగా కనబడుతోంది. అప్పుడు నేను సరిగ్గా లెక్కబెట్టుకోలేదేమో? అది నా పొరపాటేకావచ్చు. వచ్చే స్టేషన్‌లో కలకత్తాకు ఒక టికెట్ కొనాలి. ఒక్కళ్ళంకాదు-అందరం తలాకాస్త వేసుకుంటేగాని టికెట్‌రాదు. కలకత్తా వెళ్ళిన తరువాత-మా తాతయ్యనడిగి డబ్బు తీసుకుని ఎవరిది వారికిచ్చేస్తాను. మనకు ఒక హాస్టల్లో డబ్బుకట్టి, భోజన వసతులు కూడా మా తాతయ్య ఏర్పాటు చేశాడు. ఆ డబ్బు ఎట్లాగయినా ఇవ్వాలికదా. దాని సంగతి తరువాత ఆలోచిద్దాం. ముందు ఒక టికెట్‌కి డబ్బు సర్దుకోవాలి. స్టేషన్ వచ్చేలోపల అందరి దగ్గర డబ్బువసూలుచేసి సిద్ధంగా ఉంచు" చెవిలో చెప్పాడు.

అతడు ఐదునిమిషాలలో అందరి పర్సులూ తెరిపించి డబ్బువసూలు చేసుకొచ్చాడు.

స్టేషన్‌రాగానే అందరూ దిగారు. ఖాళీ కంపార్టుమెంటులో ఉండటానికి అమ్మాయికి భయంపుట్టింది. రైలుదిగి రెండడుగులు వేసి నిలబడ్డది.

అతడు టిఫిన్‌పళ్లెం చేతిలో పట్టుకుని ఆమె దిగుతుందోలేదోనని అటే

చూస్తున్నాడు. ఆమె దిగగానే గబ గబా అడుగులువేస్తూవచ్చి "మీరిక్కడ దిగి పోతారా ఏమిటి? లేకపోతే మాతో టిఫిన్ తీసుకుంటారా?" అడిగాడు. అతడితోడి విద్యార్థులంతా కాఫీ టిఫిన్లు తీసుకుంటున్నారు గల గల మాట్లాడుకుంటూ.

ఆమె తలవంచుకుంది నీళ్ళునిండిన కళ్లతో.

"అయితే ఇక్కడ దిగరా?"

"ఇది మా ఊరుకాదు. తెలిసినవాళ్ళయినా ఎవరూలేరు."

"మరెక్కడికి వెళ్తారు?"

"ఎక్కడికని వెళ్ళను? అదే తెలియటంలేదు'' కళ్ళు తుడుచుకుంది.

"పోనీలెండి. ముందు ఈ టిఫిన్ తీసుకోండి కాఫీ తెస్తాను. టికెటుందా? మార్పించి తెస్తాను." ఆ మాట అడిగితే ఉన్నదీలేనిదీ తెలుస్తుందని అడిగాడు.

"టికెట్ లేదు" అన్నది ప్లేట్లో వేళ్లుపెట్టి కెలుకుతూ.

"లేదా? పోనీలెండి. మేమంతా కలకత్తా వెళ్తున్నాం. మాతోరండి. అక్కడ ఒక హాస్టల్లో మా తాతగారు మనకన్ని ఏర్పాట్లూచేశారు" అన్నాడు.

"నేను దిక్కులేనిదాన్ని చేతిలోడబ్బులేదు. ఎక్కడికివెళ్ళాలో తెలియదు మీతో ఎట్లారాను? అందరూ విద్యార్థులు. మీరు-మగపిల్లలంతా హాస్టల్లోఉంటే అక్కడ నేనుండకూడదు కదా" అన్నది తలవంచుకుని.

''ఆఁ అయితే మా తాతగారింట్లో ఉండవచ్చు. నేను అన్ని ఏర్పాట్లూ చేస్తాను''

"అయ్యో ! పెద్దవాళ్ళతో నేనెవరినని చెప్తారు? వాళ్ళతో అబద్ధాలుచెప్పి నన్నక్కడఉంచటం భావ్యంకాదుకదా. అది చాలా ప్రమాదకరం. వాళ్ళు వివరాలడిగితే నమ్మేటట్టుగాచెప్పాలి. అసలే పెద్దవాళ్ళు ఒక్కమాటతో విడిచిపెట్టరు. నిలవదీసి అడుగుతారు. వాళ్ళకు సందేహంకలిగితే ఇంటినుంచి వెళ్ళగొడతారు."

"అతడు నవ్వుతూ అలా జరగదు. మా తాతగారూ ఆయన చెల్లెలు నౌకర్లూ ఇంట్లోఉంటారు. అయితే ఆమె మీరన్నట్టుగా మాట్లాడదు. పిల్లలంటే ప్రాణం. మీకెందుకు? మీ కెటువంటి అవమానం జరగకుండా-ఆపద కలగకుండా

నేను చూసుకుంటాను. ఏమంటారు? టైమయింది. మీకు కాఫీతెచ్చి, నేను వెళ్ళి తినాలి. టికెట్ కోసం మా స్నేహితుడిని పంపించాను. మరింకేం అడ్డుచెప్పకండి"

విధిలేక సరే నన్నట్టుగా తలఊపింది.

అతడు పరుగు పరుగున వెళ్ళి ఆమెకు కాఫీ తెచ్చిచ్చి-మధ్యలో కనబడిన ఆనంద్‌దగ్గర టికెటందుకుని, తను కాఫీ టిఫిన్ తీసుకుని, రెండుప్లేట్లకూ డబ్బుకట్టి కదులుతున్న రైల్లో ఎక్కాడు.

ఆమె వెళ్ళి తన సీట్లోకూర్చుంది.

విద్యార్థులు ఒక్కొక్కళ్ళే రైలెక్కి తమస్థానాలాక్రమించి సర్దుకుని కూర్చుంటూ "భవానీ ఎక్కడ? కనబడటంలేదు" అనుకుంటున్నారు.

ఆమె ఉలిక్కిపడ్డది. ఆ మాటలకు "భవాని! నేను కాక ఇక్కడ ఇంకో అమ్మాయికూడా ఉందాఏమిటి? ఇంతమంది మగపిల్లలున్నారని పైకెక్కి కూర్చుందా?" అనుకుంది కల్పన. ఆశ్చర్యంతో పైకిచూసింది కనబడు తుందేమోనని.

"మూడుగంటల తరువాత మళ్ళీ ఒక పెద్ద స్టేషన్‌వస్తుంది. అక్కడ మళ్ళీ దిగాలి" అంటూ పైబర్తుల నాక్రమించుకుంటున్నారు కొందరు.

కల్పన కిటికీదగ్గరిసీట్లో కూర్చుని చూస్తున్నది.

ఆమె ఆలోచనలు- పెనుభూతాల్లా-తనను ఇంటినుంచి పారిపోయేటట్టుచేసిన సంఘటనలు ఒక్కొక్కటే జ్ఞాపకం వస్తున్నాయి.

తనకు బుద్ధితెలియకముందే తల్లిపోయింది. తండ్రి ఆ ఊళ్ళోకి శ్రీమంతుడు. తనను అన్నివిధాలా కనిపెట్టి చూసుకునేటందుకు అమ్మమ్మలాంటి మనిషి నౌకామెను నియమించాడు తను లేచినప్పటినుంచీ పడుకునేవరకూ ఆమె కంటికి రెప్పలా కాచి కాపాడింది. ఆమెకు తనమీద గల మమతను గ్రహించి ఆమె చెప్పినట్టు 'అమ్మా' అని పిలిచేది. తన కేది కావాలన్నా తండ్రి దగ్గర్నించి ఆమె చేతనే తెప్పించుకునేది. తనకు వేలునొచ్చినా కాలునొచ్చినా ఆమె విలవిల్లాడి పోయేది. ఆమె జబ్బుపడితే తను ఆమెకు ఎంతోసేవచేసింది. ఆమె చనిపోయిన తరువాత తన కన్నం సహించేదికాదు. రాత్రిళ్ళు తన మంచందగ్గర మంచం

వేసుకుని పడుకునే అమ్మ పోయినతరువాత నిద్రకూడా కరువైంది. కడుపులో ఏదోబాధ క్రుంగతీసేది. పిచ్చిదానిలా ఇంటిచుట్టూ తిరుగుతూ చెట్లకింద కూర్చునేది.

ఆ చెట్లనుచూస్తే ఆమెకు ప్రాణం. వాటి పూలన్నీకోసి అమ్మలాంటి ఆవిడ దండకట్టి తలలోపెట్టేది. 'ఈ బంగారుతల్లికీ ఏరాజువస్తాడో? ఈ తల్లి చెయ్యి పట్టినవాడు రారాజవుతాడు' అంటూ ఆమె తలను తన గుండె కదుముకునేది.

తను పాటపాడుతుంటే ఆమె పరవశించిపోయేది.

'నాతల్లి గానసరస్వతి. రాళ్ళను కరిగించేస్తుంది' అంటూ చెంపలు నిమిరేది.

"అమ్మా, మా స్నేహితులందరూ అమ్మాఅని పిలుస్తారు. నీవు అమ్మా అని పిలవమంటావేం? నీవు అమ్మవుకావా?"

ఆమె కన్నీరు చెంపలమీదుగా జారకుండా కళ్లూ ముఖం తుడుచుకున్నట్టుగా తుడుచుకుని "నేను అమ్మకంటె గొప్పదాన్ని. అందుకే అమ్మా అని పిలిపించుకుంటున్నాను" అనేది సంబరపడుతూ.

అమ్మ ఒకనాడు తెల్లవారి తను లేచేటప్పటికి చాపమీద పడుకునుంది. పిలిస్తే పలకలేదు. నౌకర్లంతా కళ్ళు ఒత్తుకుంటున్నారు.

"అమ్మాయిగారూ అమ్మగారింకలేరు. చచ్చిపోయారమ్మా" అంటూ అవతలికి తీసుకువెళ్ళింది ఒక ముసలమ్మ.

ఆమెపోయిన తరువాత తను నాలుగురోజులపాటు అన్నంతినలేదు. అప్పటి నుంచీ తండ్రి తనదగ్గరే కూర్చోబెట్టుకుని ఆమెను మరపింప చేశాడు.

"అమ్మా నాకునీవూ-నీకునేనూ. అమ్మ ఇంకరాదు. నిన్ను కన్నబిడ్డలా పెంచిన అమృతవర్షిణిని ఇంక మనంచూడలేము. నీవు భోజనంచెయ్యి బాగా చదువుకో ఆమె సంతోషిస్తుంది" అని ఊరడించేవాడు.

కాలం తన గాయాన్ని ఎట్లా మాయచేసి మాన్పిందో తెలియదు. అమ్మ సంతోషిస్తుందని బాగా చదువుకునేది. సంగీతం నేర్చుకునేది. అమ్మను తలుచు

కుంటూ ఆమె చీరెఒకటి తన పక్కనపెట్టుకుని దానిమీద చెయ్యివేసుకుని పడుకునేది.

తరువాత వారమయినా తిరక్కముందే నాన్న చుట్టాన్నంటూ ఒకావిడ కొడుకును తీసుకొచ్చింది. 'అన్నయ్యా' అంటూ నాన్నదగ్గర చేరి తన గోడంతా చెప్పుకునేది.

"నీ కెవరున్నారు నీవు తప్ప? నీకుమ్మాత్రం ఎవరున్నారు నేను తప్ప? ఈ మాఘమాసంలో పిల్లలిద్దరికీ పెళ్ళిచేసి మనం రామా కృష్ణా అనుకుంటూ కూర్చుందాము" అనేది.

"చూద్దాంలేమ్మా, అది చదువుకుంటానంటోంది. చదువుకోనీ" అంటూ కాలక్షేపం చేస్తూవచ్చాడు.

"చదువా! చదువెందుకన్నయ్యా? వాడు చదివాడు కనుకనా దానికి చదువు? ముందు లగ్నం పెట్టించు" అని చెవిలో రొద పెట్టేది.

తండ్రి లేనప్పుడు కొడుకును వెంటబెట్టుకుని ఇల్లంతా తిరిగేది. తన గదిలోకివచ్చి కూర్చునేవారు. తనకు చదువు సాగేదికాదు. ఆ మరునాటినుంచీ తను గదిలో గొళ్లెంపెట్టుకుని కూర్చునేది.

ఇలా ఏడాది గడిచింది. హఠాత్తుగా నాన్నకు జ్వరంవచ్చి రెండురోజుల్లో పోయాడు. ఆమె ఇంటికి పెద్దఅయింది. తను దిక్కులేనిదయింది. ఆమె తన తండ్రి పోయిన మూడవనెలన పెళ్ళికిమూహూర్తం పెట్టించింది. దానిని ఆసరాగా చేసుకుని ఆమె కొడుకు తన వెంటతిరగటం మొదలుపెట్టాడు. ఒంటరిగా గదిలోకి వచ్చేవాడు. తనకు చిరాకేసేది.

ఒకనాడు స్కూలు లైబ్రరీకి వెళ్ళుతున్నానని ఇంట్లోచెప్పి గుమాస్తాను తీసుకుని వకీలుదగ్గరికివెళ్ళి, తను ఆ ఊరు వదలిపెట్టి వెళ్ళుతున్నట్టుచెప్పి "మా నాన్న తన ఆస్తి వివరాలు మీకు తెలుసుననిచెప్పాడు. వాటిని జాగ్రత్తగా కాపాడండి. నేను మీకు ఉత్తరం రాస్తాను వివరంగా" అని చెప్పి మళ్ళీ ఇంటికి వెళ్ళలేదు. అక్కడినుంచి బస్సులో విజయవాడవచ్చి స్టేషన్‌లో వెయిటింగ్ రూములో కూర్చుంది.

ఇప్పుడు - ముందుసంగతిని గురించి - ఆలోచిస్తుంటే దారీ తెన్నూ

తెలియటంలేదు.

మూడుగంటల తరువాతవచ్చిన స్టేషన్‌లో యువకులంతా దిగినట్టున్నారు. ఆ యువకుడు మంచినీళ్ళసీసా, పెరుగన్నంపొట్లంతెచ్చి తన పక్కనపెట్టి, తలెత్తి చూసేసరికి వెళ్ళిపోయాడు.

రైలు కదిలింది. పైబర్తుమీద ఉన్న యువకుడు తననేచూస్తున్నాడు తను తెచ్చినవి తింటుందా లేదా అని.

మళ్ళీ విద్యార్థులు వాళ్ళ కబుర్లూ ఆటలూ మొదలుపెట్టారు.

కల్పన మెల్లగా పొట్లంవిప్పితిని, మంచినీళ్ళుతాగి విస్తరాకు ముక్కను కిటికీలోనుంచి బైటపడేసింది.

మళ్ళీ ఎవరో భవానీఅంటూ పైబర్తు ఎక్కుతున్నారు. ఆ అమ్మాయి తనకు ఇంతవరకూ కనబడలేదు. కనబడితే తోడుగా దగ్గరకూర్చోబెట్టుకునేది. కాని ఏదీ ఆ భవాని? ఎవరా భవాని?

ఆ రాత్రి కూర్చునే నిద్రపోయింది.

ఆ మరునాడు కలకత్తా స్టేషన్‌లో విద్యార్థులందరూ తమ తమ సూట్ కేసులతో బిలబిల్లాడుతూ దిగారు.

"ఇదే స్టేషన్. దిగండి" అని ఆ యువకుడువచ్చి ఎదురుగా నిలబడేవరకూ కల్పన దిగలేదు. అతడు తొందర పెట్టాడు.

ఇంక ఆగలేక దైవమ్మీద భారంవేసి తన కాగితంపొట్లం తీసుకునిదిగి, ఒక పక్కగా నిలబడ్డది.

"ఒరే ఆనందూ! శరత్తూ! మీరంతా ఈ ఉత్తరం రసీదులూ తీసుకుని హాస్టల్‌కి వెళ్ళండి. సామాను సర్దుకుని స్నానాలూ భోజనాలూ చేయండి. నేను మా తాతగారింట్లో ఈ అమ్మాయిని దింపివస్తాను" అంటూ తన సూట్‌కేసందు కున్నాడు.

అందరూ వింతగా తనవంకచూస్తుంటే "ఈమె మా కజిన్. మా తాతగా రింటికి వెళ్తోంది. నేను మావాళ్ళందరినీ ఒకసారిచూసి మనకు కావలసిన డబ్బు కూడా తీసుకువస్తాన"ని టాక్సీలో కల్పనను ఎక్కించుకుని బయలుదేరాడు.

టాక్సీ ఇంటిముందర ఆగగానే నౌకర్లందరూ ఎదురుగావచ్చి "చిన్నబాబు గారొచ్చారంటూ" కారులోనుంచి పెట్టె అందుకుని కల్పనను వింతగా చూశారు. ఇంతలోకి తాతగారువచ్చి ''భవానీ, వచ్చావా? నీకోసమే ఎదురుచూస్తున్నాను. లోపలికి రా. ఎవరో అమ్మాయికూడా వచ్చినట్టుంది. క్లాస్‌మేటా? కాలేజిమేటా? లోపలికి తీసుకురా'' అన్నారు.

హాల్లోకి రాగానే మేనత్త భోజనాలింట్లోకి తీసుకువెళ్ళి ఇద్దరికీ కాఫీ, టిఫిన్ పెట్టింది. ''తీసుకో అమ్మా, రైలుప్రయాణం చేసి అలిసిపోయారు, వేడినీళ్ళు న్నాయి. స్నానాలుచేసి విశ్రాంతి తీసుకోండి'' అన్నది పక్కగా కూర్చుని.

ఆమె మాటల్లో పిల్లలకోసం అలమటించిన ఆర్తి కనబడ్డది కల్పనకు. తల ఎత్తి కళ్ళు విశాలంచేసుకుని ఆమెను చూసింది. ఆమె కళ్ళల్లో మమత మెరుపులా మెరిసింది. వెంటనే అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. 'మమతనుపంచే దేవతామూర్తులు' ఇంకా ఉన్నారుకాబోలు ఈ లోకంలో అనుకుంది.

కనురెప్పలు దాటాలని చూసిన కన్నీళ్ళను అదిమిపట్టి తలవంచుకుని కాఫీ టిఫిన్ తీసుకుంది.

"అమ్మాయీ, నీపేరేమిటోగాని స్నానంచెయ్యి" అంటూ తీసుకువెళ్ళింది. కల్పన స్నానంచేసి పొట్లంవిప్పి తన బట్టలు కట్టుకుని విప్పినబట్టలు పిండుకుని బైటికి వచ్చింది. పెరట్లో చెట్లకు తన బట్టలు ఆరబెట్టుకుంది. కల్పన లోపలికి వస్తుంటే మాటలు వినబడ్డాయి.

"అత్తయ్యా, ఈ అమ్మాయి ఈ ఊరు చూడటానికి వచ్చింది. విద్యార్థిని. మగపిల్లల హాస్టల్లో ఆడపిల్లలను ఉండనివ్వరు. అందుకని మనింటికి తీసుకు వచ్చాను. ఈ అమ్మాయికి చాలా ముఖమాటం, ఎవరితో మాట్లాడదు. దారిపొడు గునా ఏదిచ్చినా సరిగాతినలేదు. కొంచెం జాగ్రత్తగా చూసుకోండి" అంటున్నాడు.

"ఇతడేనా భవానీ అంటే? ఆడపిల్లేమో ననుకున్నాను" నవ్వుకుంటూ లోప లికి వచ్చింది కల్పన.

"అదేమిట్రా? ఇంటికి ఒక ఆడపిల్లవస్తే బాగాచూసుకోమా? నీవు నిశ్చిం తగా వెళ్ళు. నిద్రాహారాలులేని ముఖంలా ఉంది. రెండు రోజులు విశ్రాంతిగా ఉండనివ్వు. తరువాత ఊరిమాట చూసుకోవచ్చు" అంది మేనత్త.

భవాని రెండురోజులయినా రాలేదు. కాని టెలిఫోనులో మాట్లాడుతున్నాడు అత్తయ్యా అంటూ.

ఈ రెండురోజుల్లో కల్పన కొంచెం తలఎత్తి మాట్లాడకలుగుతోంది. మూడవనాడు తాతగారికి కాఫీ టిఫిన్ తీసుకువెళ్ళి ఇచ్చింది.

ఆయన ఆమెను చూడగానే ''నాకు నీవు కాఫీ టిఫిన్ తెచ్చావా? ఇలా కుర్చీలో కూర్చో. ఏం చదువుతున్నావు? నీపేరేమిటి? ఏఊరు? మీనాన్న ఏం చేస్తూ ఉంటాడు?'' వివరాలన్నీ అడిగాడు.

కల్పన వెంటనే జవాబు చెప్పలేకపోయింది. దేహం వణికింది.

"భయం లేదమ్మా, చెప్పు?"

ఇంట్లో ఉంటున్నతరువాత చెప్పకపోతే బాగుండదనుకుని, కొంత ఉన్నదీ కొంత లేనిదీ పడుగూపేకల్లానేసి ఆయనకు చెప్పింది.

"అలాగా, ఆ మగపిల్లలతో పరుగెత్తుతూ ఊరేంచూస్తావుగాని, మా చెల్లెలు కారులో తీసుకెళ్ళి ఊరుచూపిస్తుంది. నీవు హాయిగా రెండురోజులు కాదు, నాలుగు రోజులు విశ్రాంతి తీసుకో" అన్నారు ఆమెవైపు చూస్తూ.

"సరేనండి'' టిఫిన్ప్లేటూ కప్పూ తీసుకునివచ్చి లోపలపెట్టి గోడకానుకుని మోకాళ్ళ మీద తలపెట్టుకుని కూర్చుంది కళ్ళుమూసుకుని.

కాసేపటిలో ఆమె వచ్చింది. "అదేమిటమ్మా అక్కడ కూర్చున్నావు? గదిలో పడుకుందువుగాని రా" అంటూ చెయ్యిపట్టుకుని తీసుకువెళ్ళి తన గదిలో మరో మంచంవేసి పక్క వేయించింది.

మానసికంగా అలిసిపోయిన కల్పన పక్కమీద వాలిపోయింది.

భోజనాలవేళకు తాతగారి పంక్తిన ఆమెతోకూడా భోజనం చేసింది. కల్పనకు కళ్ళు మూసుకుపోతున్నాయి. భోజనం కాగానే మళ్ళీ పడుకుంది. లేచేసరికి ఐదుగంటలయింది. లేవబుద్ధి పుట్టలేదు, చలిగా ఉన్నట్లనిపించింది.

"అయ్యో, వాళ్ళేమనుకుంటారు ఇంకా పడుకుంటే?" అని లేచి కూర్చుంది. ఎన్నాళ్ళయింది ఇంతహాయిగా నిశ్చింతగా నిద్రపోయి? ఈ యింటి వాతావరణం తన మనసుకు ఉపశాంతిని కలిగిస్తోంది.

ఇది తీయటి కలకాదు కదా ?

''అమ్మాయి నిద్రలేచిందేమో చూడు'' కల్పన గదిలోకి నౌకర్ని పంపించింది ఆమె.

వెంటనే కల్పనలేచి ముఖం కడుక్కొని తలవెంట్రుకలు సరిచేసుకుని వచ్చింది.

"ప్రయాణబడలిక ఇంకాపోలేదు ? కాఫీ టిఫిన్ బల్లమీద ఉన్నాయి తీసుకో. రేపు మనం ఊరు చూడబోతున్నాం. ఇక్కడ చూడవలసిన గుళ్లూగోపురాలు నాకు తెలిసినవేకాక భవానికి ఫోన్ చేసి అడిగి చూపిస్తాను. రెండు మూడు రోజులయినా తిప్పి చూపిస్తాను" అన్నది.

"సరేనండి" కాఫీకప్పు ప్లేటూ కడిగి బల్లమీద పెట్టింది.

"ముఖం అట్లా ఉందేం ? ఇట్లా చెయ్యిచాపు చూస్తాను" అంటూ చెయ్యి పట్టుకుని చూసింది.

"అమ్మాయీ ! జ్వరంగా ఉంది, కప్పుకుని పడుకో. అన్నయ్యకు చెప్పి వస్తాను" అంటూ వెళ్ళి "ఆ కల్పనకు జ్వరం వచ్చిందన్నయ్యా. డాక్టర్ని పిలిపిద్దామా ?" అడిగింది.

కారు పంపించి డాక్టర్ని పిలిపించింది.

డాక్టరువచ్చి చూసి "బ్లడ్ టెస్టు చేసి మందిస్తాను. మలేరియా కావచ్చును. మా నర్సింగ్ హోమ్ దగ్గరేగా ? అక్కడ రెండురోజులుంచండి" అన్నాడు.

భవానీశంకర్ తాతగారు గౌరీశంకర్ రామ్. ఆయన వ్యాపారం, షేర్ల అమ్మకం, ఫోన్లమీదనే చేస్తూఉంటాడు. లక్షలకొద్దీ డిపాజిట్లను లాకర్లలో పెట్టాడు. భార్యా కూతురూ కూడా చనిపోయారు. బాలవితంతువైన నారాయణి మాత్రం అన్నగారి దగ్గరే ఉండిపోయింది. భవానీశంకర్ ఆయన కూతురి కొడుకు. అయినా ఆమెను "అత్తయ్యా" అంటాడు. తెలుగువాళ్ళయినా బంగాళాదేశపు అలవాట్లు కొన్ని ఉన్నాయి.

"నారాయణీ, ఈ అమ్మాయిని రెండురోజులు ఆయన నర్సింగ్ హోములో ఉంచితే బాగుండదూ ? నీవు కూడా వెళ్ళు. తరువాత ఒక నౌకర్ని అమ్మాయి

దగ్గర ఉంచి, ఆయన ఏంపెట్టమంటే అవే ఇంటినుంచి పంపుదాము" అన్నారు.

"సరే తీసుకువెళ్తాను. భవానీ కనక ఫోనుచేస్తే ఈ సంగతి చెప్పు" అంటూ డాక్టరు వెళ్ళిన తరువాత కల్పనను తీసుకుని నర్సింగ్‌హోముకు వెళ్ళింది. ఆమె ముందరే రక్తపరీక్ష చేశారు. వాటి ఫలితాలు తెలిసేవరకూ జ్వరం తగ్గటానికి మందిస్తానన్నాడు డాక్టరు.

"కల్పనా, నేను నీకు తోడుగా మనిషిని పంపిస్తాను. ఇక్కడ ఉంటావా?" అడిగింది నారాయణమ్మ.

ఉంటానని తల ఊపింది కల్పన.

పాలు బ్రెడ్ ఇంటినుంచి వస్తున్నాయి. ఒక నౌకరు అక్కడే ఉంటున్నది. టెస్ట్ ఫలితాలు వచ్చాయి మరునాడు. "వాటిలో ఏమీదోషం లేదు. మాత్రలతోనే జ్వరం తగ్గింది. ఆ మరునాడు ఇంటికి వెళ్ళవచ్చని" డాక్టరు చెప్పాడు.

సాయంత్రం ఐదుగంటలకు రోగులను చూడటానికి ఒకామె వచ్చింది. అందరినీ చూసి కల్పన గదిలోకికూడా వచ్చి కుర్చీలో కూర్చుంది.

"ఏమయిందమ్మా ఇక్కడచేరావు ?" అడిగింది.

"జ్వరమని వచ్చాను. తగ్గిపోయింది రేపు వెళ్ళిపోతాను."

"అలాగా, ఏంచేస్తున్నావు ?"

"నేను ఇంటరు మొదటిసంవత్సరం కాలేజిలో చేరాలి. నా పరీక్షాఫలితాలు ఒకటి రెండురోజుల్లో తెలుస్తాయి" అన్నది.

"అయితే ఒక పనిచెయ్యి. నేను నిర్మలాదేవి కాలేజి ప్రిన్సిపల్‌ని అక్కడ చదువు బాగుంటుంది. కేవలం ఆడపిల్లలకే, హాస్టలుకూడా ఉంది. సంగీతం కావాలంటే వేరే క్లాసులున్నాయి. ఇదిగో నా విజిటింగ్‌కార్డు. నీ రిజల్సురాగానే నీ సర్టిఫికెట్లు తీసుకుని రా" అని సాదరంగా చెప్పింది.

కల్పన తల ఊపింది.

"మర్చిపోకు, తప్పకుండా రా" అని ఆమె వెళ్ళిపోతూ "ఎంతబాగుందీ పిల్ల చెక్కిన శిల్పంలా" అనుకుంది.

ఆ మరునాడు ఇంటికివచ్చిన కల్పన చాలా సంతోషంగా ఉంది. తను హాయిగా ఇక్కడే హాస్టల్లోఉండి చదువుకోవచ్చుననుకుంది.

మరునాడు హాల్ టికెట్ నెంబరుతోకూడా తన ఊళ్లోఉన్న వకీలుకు ఉత్తరం రాసింది. తనపేరు మీద బ్యాంకిలోఉన్న డబ్బు తీసి డ్రాఫ్టుపంపమనీ డిపాజిట్లను కూడా పంపించమనీ ఆ యిల్లూ పొలం మంచిధర వచ్చినప్పుడు అమ్మమనీ తన రిజల్టు పేపర్లో రాగానే తెలపమనీ ఎడ్రసుకూడా తెలుసుకుని ఉత్తరం రాసింది. వీలుగా ఉంటే అవన్నీ తీసుకుని వకీలునేరమ్మని మరీ మరీ రాసింది.

"అమ్మాయీ కల్పనా, జ్వరంతగ్గిన తరువాత తిరగవచ్చని అనుకోకు, నీవు రెండురోజులు ఆగు. ఊరు చూడటానికి తొందరలేదు. భవాని రేపు ఇంటికి వస్తానన్నాడు. నేను చెప్పటం మరిచిపోయాను. ఆంధ్రాయూనివర్శిటీ పదవక్లాసు రిజల్టునిన్నటి పేపర్లో వచ్చాయి. నీ నెంబరుచెప్పు?" అడిగారు గౌరీశంకర్‌రాయ్.

కల్పన చెప్పగానే పేపరుచూసి "క్లాస్‌లో ప్యాసయ్యావు. మరోవారం ఆగి నీ సర్టిఫికెట్లు మార్కులలిస్టూ పంపమని మీ స్కూలు హెడ్‌మాస్టర్‌కి ఉత్తరం రాయి. నీకెవరూ లేరన్నావుగా? ఇక్కడేఉండి చదువుకోవచ్చు" అన్నారు. ఆయన కాకిందటరోజున నారాయణమ్మ "అన్నయ్యా, ఆ అమ్మాయి ఇంట్లో తిరుగుతుంటే ఇల్లు కళకళలాడినట్లనిపించింది. రెండు రోజులకే ఆ అమ్మాయి లేకపోతే ఇల్లు చిన్నబోయింది. కల్పన మనింట్లోఉంటే నిండుగా ఎంతసందడిగా ఉంటుందో?" అన్నది. ఆయన ఆమాట మనసులో పెట్టుకునే కల్పనతో మాట్లాడారు.

గౌరీశంకర్‌రాయ్ గారి ఇంటికి దగ్గర్లో ఇళ్ళులేవు. ఎవరిదో మామిడితోట ఉంది, ఆ తోటలో ఒక మాలికుటుంబం ఉంటుంది. ఎవరూ రాయ్‌గారింటికి వచ్చిపోతున్నట్టులేదు. కల్పనకు ఒంటరితనమనిపించింది.

ఒకనాడు రాయ్‌గారి స్నేహితుడు కుటుంబంతో చూడటానికి వచ్చాడు వెంట ఇద్దరమ్మాయిలు కూడా వచ్చారు.

"కల్పనా, మనింటికి అమ్మాయిలు వచ్చారు చూడు. గదిలోనుంచి బైటికిరా" అని పిలిచి "మీరంతా ఒక ఈడువాళ్ళు, పెరట్లో చెట్టకింద సిమెంటు బెంచీలున్నాయి. అక్కడ కూర్చుని మాట్లాడుకోండి" అని పంపించింది నారాయణమ్మ.

ఒకరినొకరు చూసుకుని నవ్వుకుంటూ చెట్లకిందికి వెళ్ళారు. ఆ ముగ్గురిలోకీ కల్పన పెద్దది. ఆలస్యంగా స్కూల్లో వెయ్యటంవల్ల పద్దెనిమిదేళ్ళు దాటినా కాలేజి చదువు మొదలు కాలేదు. ఆ పిల్లలిద్దరూ పదిహేనేళ్ళు నిండుతాయనగా పదవక్లాసు ప్యాసయ్యారు.

"ఇంక మీరు కాలేజిలో ప్రవేశించాలికదా?" అంది కల్పన.

"అవును, మా రిజల్ట్సు వచ్చేశాయి. ఇంక కాలేజిలో చేరే ప్రయత్నాలు చెయ్యాలి." అన్నది ఆ యిద్దరిలో ఒకమ్మాయి. ఆమె పేరు మిన్నూ.

"ఇక్కడ నిర్మలా దేవి కాలేజి ఒకటి ఉన్నదటకదా. చాలాబాగా చదువు చెబుతారట నిజమేనా?" అడిగింది కల్పన.

"అదొకటేకాదు ఇంకా ఉన్నాయి. అన్నీ బాగానే ఉంటాయని మా అమ్మ చెప్పింది.

"నిర్మలాదేవి కాలేజి చాలా దూరమా?"

"పెద్ద దూరంలేదు. వాళ్ళకు హాస్టలు కూడా ఆ కాంపౌండులోనే ఉంది." అంది మిన్నూ.

ఆ మరునాడు రాయ్‌గారు, నారాయణమ్మగారు నిద్రపోతుండగా కల్పన ఇచ్చిన చీటీ పట్టుకుని ఆ కాలేజి చూడటానికి వెళ్ళింది. ఆ కాలేజి హాస్టల్లో ఉండి చదువుకోవాలని ఆమె ఉద్దేశ్యము. ఎన్నాళ్ళనీ రాయ్‌గారింట్లో ఉంటుంది? వకీలు దగ్గరనుంచి సర్టిఫికెట్ల మార్కులలిస్టు వస్తే ఇక్కడ దరఖాస్తు పెట్టచ్చు. అయనను వాటితో పాటు డబ్బు డిపాజిట్లు కూడా పంపమని రాసింది ఇదివరకే. కాని వెనక్కు తిరిగింది-

ఒంటిగంటకు బయలుదేరిన అమ్మాయి ఐదుగంటలయినా ఇల్లుచేరుకోలేదు.

నారాయణమ్మగారు నిద్రలేచి చూస్తే కల్పన కనబడలేదు. నౌకర్లనందరినీ పిలిచి అడిగింది. వాళ్ళు చూడలేదన్నారు.

ఎక్కడికి వెళ్ళింది కల్పన? ఈ ఊరు తెలియని అమ్మాయి ఎవరికీ చెప్పకుండా ఎట్లా వెళ్ళింది?

ఆమె ఆందోళనతో అన్నగారికి చెప్పింది? అయన కూడా గుర్ఖాతో పని వాళ్ళనందరినీ పిలిచి చుట్టుపక్కల ఎక్కడైనా ఉందేమోనని వెతకమన్నారు.

నాలుగుగంటల పోస్టులో కల్పనకు వకీలు దగ్గరనుంచి ఆమె కోరినవన్నీ వచ్చాయి రాయ్‌గారు సంతకంపెట్టి తీసుకున్నారు.

అంతలో భవానిశంకరు వచ్చాడు. వాళ్ళ ముఖాలను చూసి "ఏమిటిలా ఉన్నారు? అంతాకులాసాగా ఉన్నారు కదా?" అడిగాడు,

నారాయణమ్మగారు "కల్పన ఎక్కడికెళ్ళిందో కనబడటంలేదురా. నేను మధ్యాహ్నం పడుకున్నప్పుడే తనూ పడుకుంది. రెండుగంటలకు లేచి చూస్తేలేదు. అన్నయ్య చుట్టుపక్కల వెతకమని నౌకర్లను పంపించాడు. ఏం తోచకుండా ఉంది" అన్నది.

"అయ్యో, ఆ అమ్మాయికి ఊరుకొత్త, చేతిలో డబ్బులేదు. కాళ్ళకు చెప్పులయినాలేవు. రెండు మాసినచీరలతో కాలక్షేపంచేస్తున్నది. మా స్నేహితులను పంపించి నేను యింటికి వచ్చి ఆమెకు బట్టలు కాలి జోళ్లూ అవీ కొనాలనుకున్నాను. కాని ఇంతలోకి ఇలా జరిగింది." మనిషి కూలబడిపోయాడు.

నౌకర్లందరూ తలా ఒకచోటికి వెళ్ళారు. వెతకటానికి అంతావెతికి వాడి పోయిన ముఖాలతో ఇంటికి వచ్చారు.

''ఇంత దూరం ఈ అమ్మాయిని తీసుకువచ్చి రౌడీల పాలపడేశానా? ఇది అసలే మహానగరం." అనుకుని తలమీద చేతులు పెట్టుకుని ఆలోచిస్తూ "అత్తయ్యా, ఆ అమ్మాయిని ఏ నర్సింగ్‌హోమ్‌లో చేర్చారూ?" అని అడిగాడు. నర్సింగ్‌హోమ్ పేరు చెప్పగానే అక్కడికి కారులో వెళ్లాడు. ఆ నర్సింగ్ హోములో రోగులను చూడటానికి వచ్చినవాళ్ళు సంతకాలు చేయటానికి ఒక రిజిస్టరు బల్లమీద పెడతారు. కల్పన అక్కడ ఉన్న రోజుల్లో వచ్చిన విజిటర్ల పేర్లు చదివాడు. ఆ పేర్లలో నిర్మలాదేవి పేరుంది. ఇంటికి వచ్చాడు వెంటనే.

"ఒకవేళ నిర్మలాదేవి కాలేజికి వెళ్ళిందా?" రాయ్‌గారు అలోచిస్తున్నారు అక్కడ అప్పుడే.

"అట్లా వెళ్ళి ఉండదు. ఆమె చాల బిడియంగలది. అందులో మనతో చెప్ప కుండా వెళ్ళదు" అన్నాడు భవానీతో.

"మరి-ఇది కొత్త ఊరుకదా? దారితెన్నూ తెలియదు. కాగా ఇక్కడ తెలిసిన వాళ్ళెవరున్నారని ఆమెకు? తెలిస్తే మన యింటికి వస్తుందా?" అన్నాడు భవాని.

"ఇవాళ ఆమెకు రిజిస్టర్డు కవరొకటి పొద్దుపొటిది వచ్చింది. నేను సంతకంచేసి తీసుకున్నాను. ఆ అమ్మాయి పేదపిల్ల అని అనుకోకు. ఆ అమ్మాయి పేరుమీద నాలుగువేల రూపాయల డ్రాఫ్టు లక్షా ఏభయివేల ఫిక్స్‌డ్ డిపాజిట్లు వాళ్ళ వకీలు పోస్టులో పంపించాడు. ఇల్లూ, పొలాలు ఇంకా లక్షపైన రావచ్చుట. ఆమె సర్టిఫికెటు, మార్కులలిస్టు రాగానే పంపుతానని ఉత్తరం రాశాడు. ఆమె తండ్రి ముందుజాగ్రత్తగల మనిషిలా ఉన్నాడు. అమ్మాయి ఒంటరిదని ఎవరూ మోసంచేయకుండా ఒక వకీలుకు అంతా ఒప్పగించాడు."

''ఆ అమ్మాయికి తెలుసా ఇవన్నీ వచ్చినట్టు?''

"తెలియదు. ఆమె ఉంటే నేను సంతకంచేసి ఎందుకు తీసుకుంటాను?" అన్నాడు రాయ్‌గారు.

భవానీ ఆలోచనలో పడ్డాడు—ఆమె టికెట్ లేకుండా రైలెక్కి కూర్చొవటమూ, ఏమీ తినకుండా ఉంటే తను తెప్పించిన టిఫిన్ తినటానికి ముఖమాట పడటం దగ్గర్నుంచీ ఒక్కొక్కటే జ్ఞాపకం రావటం మొదలుపెట్టాయి. ఆమెకు జ్వరం వచ్చినప్పుడు తనువచ్చి చూడటానికి కుదరలేదు. స్నేహితులను ఎక్కడి వాళ్ళనక్కడికి పంపడంలో మునిగి ఉన్నాడు. మేనత్తమీద వదలిపెట్టి వెళ్ళాడు.

భవానీ మనసులో కల్పనను గురించి అనేక రకాల ఆలోచనలు దొర్లుతున్నాయి.

పెరట్లో అనేకరకాల పూలున్నాయి. అక్కడ ఒక చిన్న గదీ మెట్లు కనబడ్డాయి కల్పనకు. ఇంట్లో అందరూ నిద్రలు పోతున్నారు. కింద వంటయింటి పక్కన పూజలుచేసుకునే గదిఉంది. దాని నిండా దేవుళ్ళ ఫోటోలున్నాయి. ఆ పూలన్నికోసి ఒక గదిలో పోసుకుని నారాయణమ్మ గదిలో దారముంటే తీసుకుని ఆ గది డాబామీద కూర్చుని ఆ ఫోటోలకు దండలు వెయ్యాలని కట్టటం మొదలు పెట్టింది. ఆమెకు కింద ఏంజరుగుతుందో తెలియదు. కట్టటమైన తరువాత గిన్నెలో పెట్టుకుని దిగి వచ్చింది.

అప్పటికి ఆరుగంటలు దాటింది.

నారాయణమ్మ ఇంట్లో దీపాలు వెలిగించింది.

"కల్పనా! ఎక్కడున్నావమ్మా ఇంత సేపటినుంచీ?" అన్నయ్యా! భవానీ! కల్పన వచ్చిందర్రా రండి" అందరికీ తెలియాలని కేకలు పెట్టింది.

అందరిముఖాలల్లో భయాందోళనలు చూసింది కల్పన.

"ఏమయింది అట్లాఉన్నారు ?" అనుకుని తెల్లబోయిచూస్తోంది.

"ఎక్కడున్నావమ్మా అప్పటినుంచీ? ఊరంతా వెతికిస్తున్నాడు అన్నయ్య. భవానీకూడా వెతుకుతున్నాడు" అన్నది.

"మీరందరూ నిద్రపోతున్నారు. నాకేమి తోచలేదు. పూలన్నీకోసి ఆ చిన్న డాబామీద దండలు కడుతున్నాను. మధ్యాహ్నంవేళ చదువుకునేదాన్ని. నాదగ్గర పుస్తకమేలేదు. అందుకని పూలుకోసి దండలు కడుతున్నాను. దేవుడి ఫొటోలకు వెయ్యటానికి" అంది తలవంచుకుని.

"అయితే ఇంట్లోనే ఉన్నావుటమ్మా ఇంత సేపూను ?" అని నవ్వుకున్నారు రాయ్‌గారు.

భవానీ సరేసరి. ఈమెనుగురించి ఎంతదిగులుపడ్డాడు? అక్కడికీ ఇక్కడికీ తిరిగాడుకూడాను. ఆమెకంటికి కనబడగానే ఏమీ ఎరగన్నట్టు చూస్తున్నాడు.

అంతలో రాయ్‌గారు "అమ్మాయీ నీ పేరుమీద రిజిస్టర్డు కవరుపోస్టులో వచ్చింది. నీవు ఎక్కడా కనబడలేదు. నేనే సంతకంపెట్టి తీసుకున్నాను చూసుకో. ఎవరురాశారో ?" అంటూ తీసుకువచ్చారు.

ఆమె దానినందుకుంటూఉండగా వెతకటానికి వెళ్ళినవాళ్ళు ఒక్కొక్కరే వచ్చారు.

"అమ్మాయి ఇంట్లోనే ఉందర్రా. ఎవరూ ఇంట్లోచూడకుండా బయట వెతుకుతున్నారు" అని రాయ్‌గారు అందరినీ మందలించి పంపేశారు.

కల్పన నారాయణమ్మతోకూడా దేవుడిగదిలోకివెళ్ళి పెద్దదండను ముక్క-

లుగా కత్తిరించి అన్ని ఫొటోలకువేసి దీపం వెలిగించి సాష్టాంగ నమస్కారంచేసి పైటికివచ్చింది.

ఎదురుగా భవానీ నిలబడి ఉన్నాడు.

సిగ్గుతో తలవంచుకుంది.

నారాయణమ్మ వచ్చి "అమ్మాయీ ఇప్పుడిలా నవ్వుతూ ఉన్నాడుగాని వచ్చినప్పటినుంచీ ఆందోళన పడిపోతున్నాడు."

"అవును, ఆ అమ్మాయిని తీసుకొచ్చి తెలియని ఊళ్ళో ఏ రౌడీలపాల బడేశానో ఏమిటోనని భయంవేసింది. నర్సింగ్ హోముకి వెళ్ళి ఆనాటి రిజిస్టరు చూశాను ఎవరెవరు విజిట్ చేశారోనని. నిర్మలాదేవి పేరు కనబడగానే అటువెళ్ళాను అక్కడ కనబడలేదు. మనసుకొంచెం తేలికపరచుకుని అక్కడక్కడా తిరిగి యింటికివచ్చాను." అన్నాడు ఆందోళనపడిన ముఖంతో.

"నేను ఆమెను నర్సింగ్ హోముకువస్తే చూశాను. నన్ను తన కాలేజీలో చేరమన్నది. సంగీతం క్లాసులుకూడా సాయంత్రపువేళల్లో ఉంటాయట. వచ్చి నేర్చుకోమంది. అన్నిరకాల మ్యూజిక్ నేర్పుతారట అక్కడ. డాన్సుకావాలంటే ఆ టీచర్నికూడా పిలిపిస్తానంది. నేను మీతోచెప్పి వెళ్ళాలనుకున్నాను" అన్నది మెల్లగా.

"ఇంకానయం వెళ్లావుకాదు." అన్నాడు సన్నగా భవాని.

కల్పన ఉత్తరంపట్టుకుని రాయ్‌గారిదగ్గర కెళ్ళి "ఈ ఉత్తరంకోసమే రోజూ ఎదురుచూస్తున్నాను. వచ్చింది. నన్ను ఇక్కడ ఏదయినా మంచికాలేజీలో చేర్పించండి. నా సర్టిఫికెట్, మెమోరాగానే, హాస్టలు ఉన్న కాలేజి అయితే మరీమంచిది" అన్నది.

"చూద్దాం, అవన్నీ రానీముందు" అన్నారు రాయ్‌గారు.

అంతలో నారాయణమ్మ అందరినీ భోజనాలకు రమ్మని పిలిచింది.

రాయ్‌గారు వస్తుంటే ఇంటిముందు జీపు ఆగింది. ఆయన వెనక్కువెళ్ళి జీపులోనుంచి దిగుతున్న ఆయనను తనగదిలోకి తీసుకువెళ్ళారు.

అవచ్చినాయన రాయ్‌గారి స్నేహితుడే, పోలీసు సూపర్నెంటు.

"ఇవాళ పట్టుకున్నానండి ఇంట్లోఉండగా ఆ నిర్మలాదేవిని. ఇంటికి దూరంగా కారు ఆపుకుని వరండాలోనుంచి చూశాను. ఆడపిల్లలూ మగపిల్లలూ పాప్‌మ్యూజిక్ పాడుతూ స్టెప్పువేస్తున్నారు, ఆమెమీద మాకు బండెడు రిపోర్ట్సు వచ్చాయి. ఆడపిల్లలను మగపిల్లలతో కలిపి పాడిస్తుందిట. మగపిల్లలతో ఆడ పిల్లలను జతచేస్తుందటకూడాను. అందుకే మ్యూజిక్ డాన్సు అని ఆకర్షణీయంగా పిల్లలువస్తారు. మీ యింటినుంచి ఫోన్‌కాల్‌చేస్తే మా యస్సైవస్తాడు వాన్‌లో సిబ్బందితోవచ్చి తీసుకుపోతాడు" అంటూ ఫోన్‌కాల్ చేసుకున్నాడు. కొంచెంసేపు రాయ్‌గారితో మాట్లాడి వెళ్ళిపోయాడు.

భోజనాలింట్లో అందరూ రాయ్‌గారికోసం ఎదురుచూస్తున్నారు. ఆయన రాగానే భోజనాలు మొదలుపెట్టారు. అప్పుడు రాయ్‌గారు ఎవరు వచ్చిందీ చెప్తూ నిర్మలాదేవి సంగతులుకూడా వాటికి జోడించారు

అందరిలో నారాయణమ్మ అంతా విని 'పాపం' అనుకుంది. ఆ సంగతంతా విని కల్పన భయపడ్డది.

కల్పన అక్కడికి పోనందుకు భవాని సంతోషించాడు.

అటువంటి ఆమెదగ్గరికి వెళ్ళదలచుకున్నందుకు కల్పన తలవంచుకుంది అతడిముందర.

భోజనాలయిన తరువాత గది వరండాలోకి వెన్నెల పరచుకున్నట్టుగా ఉంటే అక్కడ కూర్చున్నాడు భవాని. తనబట్టలు తీసుకోవటానికి వచ్చిన కల్పనను కూర్చోమన్నాడు భవాని ఒక కుర్చీచూపించి.

ఆమె భయపడుతూ కూర్చుంది.

"మీ మార్కులు తెలిశాయా ? వస్తే సర్టిఫికెట్‌తో ఏదయినా కాలేజిలో చేర్పిస్తాను" అన్నాడు.

"ఇంకా రిజల్ట్సు రాలేదుగా ? ఇక్కడ మంచి కాలేజీలు, హాస్టలు ఉన్నవి ఉంటే చూడండి. ఇవాళ మావకీలు ఒకడ్రాఫ్టు కొన్ని ఎఫ్.డి లు పంపించాడు."

అలాగా, సరేచూస్తాను. ఇక్కడ బ్యాంకు ఎకౌంటు పెట్టుకోండి. ఎఫ్.డి.లు లాకర్ తీసుకుంటే దానిలో భద్రంగా పెట్టుకోవచ్చు. ఎక్కడ చదువుకున్నా

బ్యాంకుకువెళ్ళి డబ్బుతీసుకోవచ్చు" అన్నాడు ఆమెముఖంలోకి చూస్తూ.

అలా అలా మాటల్లోకి దింపేశాడు భవాని.

కల్పన గంభీరంగా కనబడుతున్నది కాని మాటకారే. అతడితో అరమరికలు లేకుండా మాట్లాడటం సాగించింది. మాటల్లో నవ్వులూ జోకులూ ఎన్నో రకరకాల తరంగాలు పొంగిపొర్లాయి.

హాల్లో రాయ్‌గారితో నారాయణమ్మ అంటోంది "అన్నయ్యా, మనవాడి చదువై పోయింది. పెళ్ళిసంగతి ఆలోచించు. ఈ కల్పన అన్నివిధాలా బాగుంది. చదువుకుంటానంటే చదువుకొమ్మను. వాళ్ళిద్దరికీ ఈడూజోడూ బాగా కుదిరింది" అన్నది.

"వాళ్ళనుకూడా అడిగిచూద్దాం" అన్నారాయన.

"వాళ్ళిద్దరూ నిశ్చయం చేసుకున్నట్టే ఉన్నారు. నీవు వినలేదూ ఆ నవ్వులూ పకపకలూను."

"అయితే సరే. కాని వాళ్ళనోటితో చెప్పనీ" అన్నారు ఆనందంతో.

ఆ మరునాడే వకీలుగారు చేతికరపని కాగితాలకట్టతో దిగారు. తనకుతాను రాయ్‌గారితో పరిచయం చేసుకున్నారు. పెళ్ళిమాటలు విని ఎంతో ఆనందించారు. కల్పనను పిలిచి "నీకు సంబంధించిన కాగితాలన్నీ తెచ్చాను. నీపొలం ఇల్లూకూడా ఒక ఆసామీ కొన్నాడు. సంతోషంతో రెండున్నర లక్షలు యిచ్చాడు. నేను రాయ్‌గారితో మాట్లాడాను. ఎంతటి శ్రీమంతులో, అంతటి నిగర్వి. మర్యాదస్థులు. నీవు ఆయన మనమడిని పెళ్ళిచేసుకుని సుఖంగా ఉండు. నీవు నాతో చెప్పే వెళ్లావు ఆనాడు. నీదగ్గర డబ్బుందా అని అడుగుదామనుకుంటూఉండగానే గబగబా పరుగెత్తావు."

"నిజంగా నాదగ్గర మారుబట్టతప్ప ఇంకేంలేదు. చేతిలో దమ్మిడీలేదు. పరుగెత్తి స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌మీద ఉన్న రైల్లో టికెట్‌లేకుండా ఎక్కేశాను". రాయ్‌గారి మనమడట- ఆయనదట ఆ సీటు. వాళ్ళు ముందుగా రిజర్వుచేసుకున్నారట. అందరూ మగపిల్లలేగాని నన్ను దిగిపొమ్మని అనలేదు. వాళ్ళలోవాళ్ళే సర్దుకున్నారు. ఈ ఊరొచ్చిన తరువాత వాళ్ళంతా హాస్టల్లోఉండి ఊరూ అదీ చూశారట.

రాయ్‌గారి మనమడు నన్ను వాళ్ళయింట్లో దింపివెళ్ళాడు." అన్నది పైకి సంతోషం కనబడనీయకుండా.

వకీలు వెళ్ళేటప్పుడు ''అయ్యా, నాబాధ్యత తీరింది. ఇక ఆమె బాధ్యత మీది. ఒక్కగానొక్క పిల్ల. గారాబంగా పెరిగింది. తండ్రిచుట్టాలెవరోవచ్చి ఇంట్లో గొడవచేస్తుంటే భరించలేక నాతోచెప్పి ఇట్లా బయలుదేరింది. ఎట్లా ఉందో ఆడపిల్ల' అనుకున్నాను. సరియైన వాడితోనే ప్రయాణం చేసిందిట. అతడు తన బాధ్యతగా భావించి తనయింటికే తీసుకువచ్చాడు. అదృష్టవంతురాలు" అంటూ రాయ్‌గారితో కరచాలనంచేసి బయలుదేరుతుంటే రాయ్‌గారు "ఏమండోయ్ పెళ్ళికిరావాలి. ముహూర్తంపెట్టించి రాస్తాను. అమ్మాయి మీ అమ్మాయి.'' అన్నారు.

"అయ్యా, మీరు మగపెళ్ళివారు. నేను మీరుచెప్పినట్లు వినవలసినవాడిని."

భోజనాలు చేసినతరువాతకూడా మళ్ళీ కుర్చీలువేసుకుని కూర్చున్నారు కల్పనా భవానీలు. ఆమాటలు తెగటంలేదు. ముగింపుకు రావటంలేదు. నవ్వులూ నయగారాలూను.